# నామం

సలహాచెబుతాను స్వామీ..." నెమ్మదిగా అంది మంగ.

"ఏమిటది" అడిగాడు వెంకన్న.

"మీరు సరాసరి యన్టీఆర్ దగ్గరకెళ్ళి, మన సమస్యల్ని తెలియజేసి, మన ఖాతాలోంచి తీసుకున్న డబ్బులు తిరిగి జమచేయించమని అడిగితే..."

"ఈ ప్రయత్నం నేనిదివరకే చేసాను. ఒకరోజు వుదయాన్నే, భాగ్యనగరంవెళ్ళి, ముఖ్యమంత్రిని కలిసి, మన ఖజానాలోంచి తీసుకువెళ్ళిన డబ్బుల గురించి ప్రస్తావించాను. ఆయన కనీసం ఆ డబ్బు ఎవరిదనికూడా ఆలోచించకుండా, 'బాబును కలిసారా... బాబును చూసి ఆనకరండి' అంటూ వెళ్ళిపోయారు"

"ఏమండీ... మీరొక పొరపాటు చేశారండీ" ఆలోచిస్తూ అంది మంగ. "ఏమిటది" అన్నాడు వెంకన్న.

"ఈ డబ్బంతా ఏ స్విస్ బ్యాంకులోనో దాచివుంటే మనకి ఇబ్బంది వుండేదేకాదు గదా" అంది.

అదెలా కుదుర్తుంది? ఈ డబ్బులన్నీ స్విస్ బ్యాంకులో దాచుకోవాలంటే, నేనేమన్నా రాజకీయ నాయకున్నా స్విట్జర్లాండ్‌కు మన పుష్పకవిమానంలో వెళదామంటే ఒక్క పైలట్‌కూడా స్విట్జర్లాండ్‌కిగాని, చెన్నైగ్గాని రూట్ తెలియదాయె. హైజాకర్ల గొడవ ఉండనేవుంది. తీరా మన పుష్పకవిమానంలో వెళితే స్విస్ చేరాక, అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులు లాండ్ చెయ్యడానికి సిగ్నల్ ఇవ్వకుంటే నాగతేంకాను..." వివరించాడు వెంకన్న

కాలింగ్ బజర్ శబ్దంవిని వెళ్ళి తలుపు తీసింది మంగ. "ఏమ్మా వెంకన్న వున్నాడా?" అంటూ లోనికి వచ్చిన కుబేరుడ్ని చూసాడు వెంకన్న.

"ఉన్నారు రండి. అన్నయ్యా, మీ గురించే అనుకుంటున్నాం" అంటూ లోనికొచ్చింది మంగ. కుబేరుడు, మంగ ఇద్దరు ఖాళీగావున్న రివాల్వింగ్ చైర్‌చూసి గతుక్కుమన్నారు. "ఇందాక, ఈ కుర్చీలోనే కూర్చున్నారు అన్నయ్యా" అంది మంగ. "వెంకన్నా... వెంకన్నా..." అంటూ కుబేరుడు, "స్వామీ... స్వామీ..." అంటూ మంగ ఇద్దరూ, ఇల్లంతా వెతికారు. ఫలితం శూన్యం.

(ఇది కేవలం హాస్యంకోసం రాసినవ్యంగ్య రచన. ఎవరినీ నొప్పించేవుద్దేశంతో రాసింది కాదని గమనించగలరు.)

# తుమ్మెద

## మినీ కథ



"మీరింతకు తెగిస్తారనుకోలేదు. నన్ను నమ్మించి చివరికి నాగొంతు కొయ్యాలనేగా, నాబ్రతుకు నట్టేట్లో ముంచాలనిచూస్తున్నారా...ఇది మీకు తగదండీ... ఆడదాని ఉసురుపోసుకుని ఏ మగాడు సవ్యంగా జీవించలేదు."

"ఏం బెదిరిస్తున్నావా?" నిర్లక్ష్యంగాకాలర్ ఎగరేశాడు మహేష్!

"లేదు, బ్రతిమాలుతున్నాను. మీ జీవితం అరిష్టంపాలు కాకూడదని వేడుకుంటున్నాను" ధారాపాతంగా వర్షిస్తున్నాయ్ విమల కళ్ళు.

"అయ్యిందేదో అయిపోయింది. నా కోరిక తీర్చుకున్నాను. పూవు పుట్టింది నాలాంటి తుమ్మెదలకోసమే. నీ ముచ్చటాతీరింది. ఇద్దరికీ లాభమే జరిగింది, ఎవరూ నష్టపోయింది లేదు. రభస దేనికి ఇదో ఈ డబ్బు తీసుకుని అబార్షన్ చేయించుకో, గంతకుతగ్గ బొంత అన్నట్టు నీకు ఎవడో దొరక్కపోడు. పెళ్ళికిపిలిస్తే అక్షింతలు వెయ్యడానికి నాకేమీ ఇబ్బందిలేదు."

"అలా మాట్లాడకు మహేష్. నీకాళ్ళు పట్టుకుంటా. నీకు చేతులెత్తి నమస్కరిస్తా. నన్నన్యాయంచెయ్యకు. ప్లీజ్..." ఉన్నపళంగా మహేష్ కాళ్ళమీదపడింది విమల

"ఛీ! ఇలాంటివి నాకు నచ్చవు. కల్లబొల్లి కబుర్లు, పగలమారి ఏడుపులు వద్దు. చెప్పొగా నీబాబు దిగొచ్చినా సరే నా నిర్ణయం మారదు. ఇంకోమాట. నీ నిలువెత్తు బంగారం పోసినా నిన్ను చేసుకోవటానికి నేను సిద్దంగాలేను. బైదిబై విమలా...నీ మ్యారేజ్ అయ్యాక...అంతగా కొత్త మొగుడు రుచించకపోతే ఈ నెంబర్‌కు ఫోన్ చెయ్. రెక్కలు కట్టుకుని వాలుతా. గుడ్‌బై."

ఇదంతా నిశ్శబ్దంగా గమనించాడు ఆ పార్కుకి వచ్చిన మఫ్టీలోవున్న ఎస్. ఐ.

చకచక నడిచివెళ్తున్న మహేష్ ముందుకు వచ్చి ఎస్. ఐ నిల్చున్నాడు. బాగా బలంగా వున్నాడు. అతని ముక్కుపుటాలు అదురుతున్నాయ్.

"బాస్టర్డ్. ఆడది అంటే అంత చులకన అనుకున్నావ్రా. నేను అంతావిన్నాను. ఛీ! స్త్రీని ఇంతగా అవమానించిన నీకు పుట్టగతులు వుండవురా, నీకు ఇప్పుడే బుద్ధొచ్చేలా చేస్తాను."

ఎస్. ఐ మహేష్‌ని ఎడా పెడా కొట్టసాగాడు. అందినచోటల్లా కుమ్ముతున్నాడు...

జరగబోయేది హింసాకాండ అని తెల్సుకుని ముందుకువురికింది విమల. అప్పటికే మహేష్ నేలకరుచుకున్నాడు.

"ఎవరివయ్యా నువ్వు! మేం ఎలా తగలబడితే నీకెందుకు? అసలు నువ్వెవరివి? ఎలాబడితే అలా కొట్టడమేనా మహేష్... మహేష్...అయ్యో స్పృహతప్పినట్లున్నాడు... ఉండు నీపని చెప్తా.. పోలీస్ కంప్లయింట్ ఇచ్చి నీకు జైలు కమ్ములు లెక్కించేపని అప్పగిస్తా" విమల ఒక ప్రక్క ఏడుస్తోంది- మరోప్రక్క ఇతన్ని దుయ్యబడుతోంది.

ఎస్. ఐ ఆశ్చర్యపోయాడు.

"అమ్మా- నువ్వెవరోగానీ- నా చెల్లిలాంటి దానివి. మీరు ఇద్దరూ ఈ పార్కులోకి వచ్చినప్పటి నుండి గమనిస్తూనేవున్నాను. ఆ రోగ్‌ని మీరు బ్రతిమిలాడటం- వాడు మిమ్మల్ని ఛీత్కరించి, విదిలించటం అంతా వింటున్నాను. వాడికి బుద్ధి చెపుదామని- మరో ఆడపిల్ల వాడివలలో ఇరుక్కోకుండా కాపాడాలని- నీకు జరిగిన అన్యాయానికి నేనసలు..."

"అన్యాయమా గుమ్మడికాయా మేమిద్దరం డ్రామాయాక్టర్లం. ఇంటిదగ్గర ప్రత్యేకంగా రిహార్సల్స్ చేసుకోవటానికి కుదరక ఇలా వచ్చాం. అయ్యో మహేష్..."

ఏదైనా కేసు దొరుకుతుందేమోనని ఈ పార్క్‌లోకి అడుగుపెట్టాను ఎస్. ఐ బుర్ర గోక్కున్నాడు.

—కోలపల్లి ఈశ్వరరావు